క్లుప్తంగా

రిజర్వేషన్లలో మార్పులు చేయండి

ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నరేశ్

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ గ్రామ పంచాయతీలోని పలు వార్డులలో అనాదిగా వస్తున్న రిజర్వేషన్లలో మార్పులు చేసి ఎస్టీలకు రెండు వార్డులు కేటాయించాలని గ్రామానికి చెందిన ఎరుకల నరేశ్ షాద్‌నగర్ ఆర్డీఓకు మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం వినతిపత్రం నకలును స్థానిక విలేకరులకు అందజేశారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన నందిగామలో ఎస్టీ జనాభాకు సరిపడు వార్డులకు రిజర్వేషన్లు కేటాయించడం లేదని పేర్కొన్నారు. ఎస్టీ జనాభా ప్రాతిపదికన నందిగామ గ్రామ పంచాయతీలో ఎస్టీలకు కనీసం రెండు వార్డులకు రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 8వ వార్డులో గత 15 ఏళ్లుగా బీసీ మహిళకు కేటాయిస్తున్నారని, ఈ వార్డును సైతం ఎస్టీలకు రిజర్వ్ చేయాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

మొయినాబాద్‌లో మోస్తరు వర్షం



మొయినాబాద్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం 4 గంటల సమయంలో కమ్ముకున్న మేఘాలతో మబ్బుగా ఏర్పడి ఒక్కసారిగా అరగంట సేపు జోరుగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో వారం రోజుల నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించింది.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

షాబాద్: గణేశ్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, మాజీ వార్డుసభ్యుడు బేగరి గణేశ్ మృతి చెందడంతో ఆయన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

ఫరూఖ్‌నగర్ ఎంఈఓ బదిలీ



శంకర్ రాథోడ్

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న శంకర్ రాథోడ్ బదిలీ అయ్యారు. 19 ఏళ్లుగా ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. అయితే కొత్త ఎంఈఓను నియమించేవరకు శంకర్ రాథోడ్ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

బాల్య మిత్రుడికి భరోసా



బాధితుడికి నగదు అందిస్తున్న స్నేహితులు

కందుకూరు: తమతో పాటు చదువుకున్న స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి (2003–04)బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్పందించారు. అందరూ కలిసి రూ.65 వేలు నగదు జమ చేశారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్ననాటి మిత్రుడైన కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన ఇస్లావత్ పాండును మంగళవారం కలిసి రూ.65 వేల నగదు అందజేశారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతామని భరోసా కల్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

షాబాద్: వర్షాకాలంవ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ వైద్యాధికారి డాక్టర్ తబసుం మెహజా అన్నారు. ఇంతకుముందు విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో కొందుర్గులో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తబసుం మెహర్‌జా షాబాద్ పీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ శంకర్, స్టాఫ్‌నర్స్ సౌజన్య, యూనాని వైద్యసిబ్బంది తాహెర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నీరుగారుతున్న నిషేధం!

- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- పర్యావరణానికి విఘాతం



పెంజర్ల రోడ్డులో ఓ కాలనీలో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

కొత్తూరు: ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీయడం.. భూతాపం పెరగడంతో పాటు పలు విపత్తులకు కారణమయ్యే నాణ్యత లేని పాలిథిన్(ప్లాస్టిక్) ఉత్పత్తులపై ప్రభుత్వం విధించిన నిషేధం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. దీనికితోడు ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన పట్టణ ప్రగతి, పల్లె ప్రగతిలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి తీర్మానం చేసి నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు నోటీసులు సైతం జారీ చేశారు. వ్యాపారులపై అధికారుల నిఘా కొరవడడంతో కొందరు వ్యాపారులు తిరిగి నాణ్యతలేని ప్లాస్టిక్ ఉత్పత్తులను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

విచ్చలవిడిగా విక్రయాలు

మండల కేంద్రంతో మొదలుకొని అన్ని పంచాయతీలు, అనుబంధ గ్రామాలు, గిరిజన తండాల్లో సైతం నాణ్యతలేని పాలిథిన్ కవర్లు, ఇతర ఉత్పత్తుల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు మొదలుకొని హోటళ్లు, అల్పాహార, కిరాణ, కూరగాయాలు, పండ్లు, ఇతర చిరు దుకాణాల్లో వీటి వాడకం రోజు రోజుకు పెరిగిపోతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న పాలిథిన్ సంచులను తయారు చేయడం, ఉపయోగించడాన్ని గతంలో ప్రభుత్వం నిషేధించింది. అయినా మండలంలో పాలిథిన్ సంచుల నాణ్యతను గుర్తించే యంత్రాలు లేకపోవడం, సంబంధిత శాఖ అధికారుల అలసత్వం కారణంగా మండలంలో 40 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న పాలిథిన్ సంచులనే వ్యాపారులు వాడుతున్నారు. మండలంలో రోజుకు సగటున 60 నుంచి 80 కిలోల వరకు పాలిథిన్ సంచుల విక్రయం సాగుతోంది. గ్రామాల్లోని పలు కాలనీల్లో వాడి పాడేస్తున్న పాలిథిన్ సంచులను కొందరు ఇళ్ల సమీపంలోనే కాల్చుతున్నారు. దీంతో సమీపంలోని ఇళ్లలోకి విషపూరితమైన పొగ వ్యాపిస్తూ రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

పాలిథిన్ సంచులతో అనర్థాలు

పాలిథిన్ సంచులు ఏళ్ల తరబడి భూమిలో కరిగిపోకుండా ఉండడంతో విపరీతమైన భూతాపం పెరుగుతుంది. వర్షాకాలంలో కాల్వల్లో వరద ప్రవాహాన్ని అడ్డుకుని సమస్యలను సృష్టిస్తాయి. నాణ్యతగా లేని పాలిథిన్ గ్లాసులు, ఇతర ఉత్పత్తుల్లో టీ, వేడి ఆహార పదార్థాలను తినడంతో పలు రకాల వ్యాధుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటిని జనావాసాల మధ్యన కుప్పగా పడేసి కాల్చడంతో విషపూరితమైన వాసన కారణంగా శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే వివిధ రకాల వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించాం. నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లు, ఇతర ఉత్పత్తులను విక్రయించడం, వినియోగించకుండా అవగాహన కల్పించాం. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు జరిమానాలు సైతం విధించాం. తరచూ చేసే తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్

అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం



ప్రియాంకను సన్మానిస్తున్న నిరంజన్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ పంచాయతీలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి ప్రియాంకను గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌గౌడ్ మాట్లాడుతూ.. అధికారులు నిజాయితీగా పనిచేస్తే వారిని ఎల్లప్పుడూ మరచిపోలేరని ఆయన తెలిపారు. నిజాయితీగా గ్రామ పంచాయతీలో నాలుగు సంవత్సరాలు పనిచేసి గ్రామస్తుల మన్ననలు పొందడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, నాయకులు రవి, మహ్మద్ జహంగీర్, నీలకంఠం, గౌరీకృష్ణ, శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం మల్లేశం, ఆశవర్కర్లు యాదమ్మ, సోనీ, జహంగీర్‌బీ, గ్రామ పంచాయతీ సిబ్బంది లక్ష్మి, ప్రమిళ, అమృత, రమేష్, జిలానీ, చిట్టి, యాదమ్మ, కారోబార్ నరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో రైతులకు అన్యాయం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో అటు రైతులు, ఇటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో జేపీ దర్గా ఆవరణలో మంగళవారం మండల కార్యదర్శి షకీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణకు అనుకూలంగా వ్యవహరించకపోవడం దారుణమన్నారు. కేంద్రప్రభుత్వ నిర్ణయాలతో అటు రైతులు, ఇటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వివరించారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు ప్రాణత్యాగాలకు సిద్ధపడి సాధించుకున్న చట్టాలను సవరించడంతో కార్మికులు అన్యాయానికి గురవుతున్నట్లు పేర్కొన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను మార్చుతుందన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసినట్లు గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో విభజన హామీల అమలు కోసం నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ నందిగామ మండల నూతన కార్యదర్శిగా గడ్డం జంగయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, అజ్మత్, శంకర్, లక్ష్మయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేవరకు పోరాటం

తెలంగాణ ఉద్యమ నాయకులు వెంకట్‌రెడ్డి, రాజు



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ నాయకులు జి.వెంకట్‌రెడ్డి, కేబుల్ రాజు అన్నారు. ఉద్యమకారుల చలో అసెంబ్లీ కార్యక్రమం పిలుపు సందర్భంగా మంగళవారం మండలంలోని తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఉదయమే ఇళ్ల వద్దకు వెళ్లి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్యమ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఉద్యమకారులకు ఇచ్చిన హామీల ఊసేత్తడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ముందస్తుగా అరెస్టు చేసిన వారిని పోలీసులు సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో ఉద్యమ నాయకులు కుమ్మరి రమేశ్, మహిపాల్, నవీన్ తదితరులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, రైతులు

షాద్‌నగర్: రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం రెండో విడత రైతు రుణమాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో ఉన్న రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతులకు విడతల వారీగా రుణాలను మాఫీ చేస్తోందన్నారు. అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వాద్యాల నర్సింహారెడ్డి, గణేశ్‌గౌడ్, జాంగారి రవి, రాజు, మధుసూదన్‌రెడ్డి, మంద రాజు, శ్రీనివాస్ యాదవ్, వెంకట్‌రెడ్డి, యాదయ్యగౌడ్, నాగిసాయిలు, సక్రు నాయక్, హన్మంతుయాదవ్, విష్ణు, నర్సింలు, భూపాల్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు తేజ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు



కొత్తూరు: పోలీస్ స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న సాయిబాబా



చేవెళ్లలో అరెస్టయిన ఆశవర్కర్ల యూనియన్ సభ్యులు

సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా

కొత్తూరు: ఆశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బీసా సాయిబాబా డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు తమను ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అమలుచేసే ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో ఆశాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా కరోనా లాంటి కష్టకాలంలో ఆశాలు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసినట్లు గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం ఆశాలకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆశాల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో విడతల వారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశాలు ఇందిరా, మంజుల, నవనీత, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: తమ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మంగళవారం ఆశాకార్యకర్తలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్తుండగా పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. అనంతరం వారిని సొంతపూచీకత్తుపైన విడుదల చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పాండయ్య, కానిస్టేబుళ్లు శ్రీశైలం, రమాదేవి, ఆశ కార్యకర్తలు వసంత, సుజాత, మల్లమ్మ, అనిత, సుమతి, గీత, సువర్ణ, మంజుల, సంతోష, మాధవి తదితరులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో మంగళవారం ఆశవర్కర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశవర్కర్లను, సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అవలంబించిన విధానాలను ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆచరిస్తూ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ధర్నా చేసేందుకు వెళ్తుంటే అరెస్టులు చేయటం సరైనది కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ పీపీ యూనిట్ వైద్యాధికారులకు, హెల్త్ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు గ్రామాల్లో తిరిగి గర్భిణులను గుర్తించి, వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. అదేవిధంగా వారికి టీటీ వ్యాక్సినేషన్, ఐరన్ ఫోలిక్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. అదేవిధంగా సంవత్సరంలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గ్రామాల్లో మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మందులను పంపిణీ చేయాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, డీఈఓలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



కొత్తూరులో సభ్యత్వ నమోదు చేయిస్తున్న గోవర్ధన్‌యాదవ్, ఉపాధ్యాయులు

కొత్తూరు: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ కోరారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన నందిగామ, కొత్తూరు మండలాల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ.. జీవో నెంబర్లు 11, 12ను సవరించి, బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు కల్పించాలన్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో ఉన్న పెండింగ్ బిల్లులు, ఉపాధ్యాయులకు 50 శాతం పీఆర్సీ ప్రకటించాలన్నారు. క్రమశిక్షణలో భాగంగా ఇటీవల ఖమ్మంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు విజయసాగర్, ఆంజనేయులు, రాఘవేందర్, అనిత, ప్రతాప్‌రెడ్డి, గోపి, బాలప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారి ఎవరో?

- దాదాపు నెలరోజులుగా ఇదే పరిస్థితి
- ఆయా గ్రామాల్లో కొరవడుతున్న పాలన
- పట్టించుకోని ఉన్నతాధికారులు



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయం

చేవెళ్ల: దాదాపు నెలరోజులుగా మండల ప్రత్యేకాధికారి జాడేలేదు. మండల ప్రత్యేకాధికారి ఎవరు ఉన్నారు.. ఎక్కడ ఉన్నారనే విషయం మండల ప్రజలకు, మండల అధికారులకు కాని తెలియదు. మండలంలో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం జూలై 4వ తేదీతో ముగియటంతో అప్పటినుంచి మండల ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండలానికి ఒక జిల్లాస్థాయి అధికారిని మండల ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చేవెళ్ల మండలానికి 26 రోజులుగా మండల ప్రత్యేకాధికారి ఎవరో కూడా తెలియదు. ప్రత్యేకాధికారుల నియామకం సమయంలో మొదటిరోజు చేవెళ్ల మండలానికి జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తిని నియమించినట్లు ఉత్తర్వులు రావటంతో ఆమె జూలై 4వ తేదీన చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించింది. మండలానికి ఆమె ఒకే ఒక్కరోజు వచ్చి బాధ్యతలు స్వీకరించి వెళ్లింది. మళ్లీ మండలానికి రాలేదు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న వారంరోజుల్లోనే ఆమె మత్స్యశాఖలో నిర్లక్ష్యంపై ఆమె సస్పెన్షన్‌కు గురైందని, ఆమె స్థానంలో డీఎఫ్‌ఓ చరితకు చేవెళ్ల మండల ప్రత్యేకాధికారి బాధ్యతలు అప్పగించినట్లు వార్తలు వచ్చాయి. కాని దీనికి సంబంధించిన అధికార ఉత్తర్వులు మండలానికి రాలేదు. దీంతో ఇప్పటివరకు ఆమె కాని ఆమె స్థానంలో బాధ్యతలు అప్పగించినట్లుగా చెబుతున్న అధికారి ఎవరు మండల ప్రత్యేకాధికారిగా మండలానికి వచ్చి బాధ్యతలు స్వీకరించలేదు. చేవెళ్ల మండలానికి అసలు ప్రత్యేకాధికారిని నియమించారా.. నియమిస్తే ఎవరు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలానికి ప్రత్యేకాధికారి గ్రామాల ప్రత్యేకాధికారులకు సలహాలు, సూచనలు అందజేయాలి. కాని మండల ప్రత్యేకాధికారి లేకపోవటంతో గ్రామాల ప్రత్యేకాధికారులు సైతం ఇష్టానుసారంగా వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిని నియమించి మండల పాలనను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

ప్రత్యేకాధికారి లేరు..

మండల ప్రత్యేకాధికారి ప్రస్తుతం ఎవరు రాలేదని, మొదట నియమించిన సుకీర్తి వచ్చి బాధ్యతలు స్వీకరించి వెళ్లారు. ఆమె సస్పెన్షన్ అయినట్లు వేరే వారిని నియమించినట్లు వచ్చిన వార్తలు చూశాను కాని మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొత్త అధికారి ఎవరు అనేది కూడా తెలియదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండురోజుల్లో మండల ప్రత్యేకాధికారిని నియమించేందుకు కృషిచేస్తా.

– హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల